www.prajaswaramdaily.com

# ప్రజాస్వరం
PRAJASWARAM తెలుగు దినపత్రిక

మెదక్ | సంపుటి : 17 | సంచిక : 321 | పేజీలు : 5 | వెల : 1

Circulated By : Hyderabad- Medak - Sangareddy - Nalgonda - Warangal - Nizamabad- Vijayawada- Guntur - Vizag - Adilabad- kurnool | బుధవారం 31-07-2024

MHR TV
www. mhrtv.com






భారీ వరదలతో కొట్టుకుపోయిన ఇండ్లు, విరిగిపడిన చెట్లు









# ప్రకృతి ప్రకోపం..

- మంగళవారం తెల్లవారుజామున ఘటన
- వరద, బురదలో గల్లంతైన వందల మంది
- రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్
- నేడు, రేపు సంతాప దినాలుగా ప్రకటించిన ప్రభుత్వం

2

## కేరళ రాష్ట్రంలో భారీ వర్షాలు

వయనాడ్ జిల్లాలో విరిగిపడిన కొండ చరియలు

ఇప్పటివరకు 133 మంది మృతి చెందినట్టు అధికారుల వెల్లడి

శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొంతమంది

అన్నివిధాలా ఆదుకుంటామని ప్రధాని మోదీ భరోసా

విలేకరులు కావలెను

ప్రజాస్వరం

పదిహేడు సంవత్సరాలుగా జర్నలిజం రంగంలో విశిష్ట సేవలందిస్తూ అత్యంత ప్రజాదరణ పొందిన ప్రజాస్వరం తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో జిల్లా స్టాఫర్లు, నియోజకవర్గ ఇన్ చార్జిలు, మండల రిపోర్టర్లు కావలెను.

సెల్ : 800 860 9999




బీఆర్ఎస్ ఎల్పీలో కేటీఆర్ తో భేటీ అయిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి

# సీఎం రేవంత్‌కు షాక్

- గద్వాల ఎమ్మెల్యే యూటర్న్!
- బీఆర్ఎస్ఎల్పీలో కేటీఆర్‌ను కలిసిన కృష్ణమోహన్ రెడ్డి
- తిరిగి పార్టీలో కొనసాగుతానని చెప్పినట్లు సమాచారం
- కొద్ది రోజులు క్రితం రేవంత్ సమక్షంలో కాంగ్రెస్‌లో చేరిక
- మరో ముగ్గురు ఎమ్మెల్యేలు సైతం మళ్లీ కారు ఎక్కుతారని ప్రచారం

2

## విద్యుత్ కమిషన్ కొత్త చైర్మన్‌గా
# మదన్ బి లోకూర్



- జస్టిస్ నరసింహారెడ్డి స్థానంలో నియమించిన ప్రభుత్వం
- ఆయన చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారంటూ గతంలో సుప్రీం మెట్లెక్కిన కేసీఆర్
- కొత్త చైర్మన్‌ను నియమించాలని ఆదేశించిన అత్యున్నత న్యాయస్థానం

2

## మనూ డబుల్ ధమాకా

2

ఒకే ఒలంపిక్స్‌లో రెండు క్యాంస్యాలు బాకర్ ఖాతాలో

తొలిభారత క్రీడాకారిణిగా రికార్డు





సీఐఐ సదస్సులో మాట్లాడుతున్న ప్రధాని నరేంద్రమోదీ

## విససిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నాం


- త్వరలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది
- పదేండ్లలో దేశ ఆర్థిక పరిస్థితిని మార్చేశాం
- అన్ని రంగాలకు బడ్జెట్‌ను భారీగా పెంచాం
- యూపీఏ హయాంలో వేల కోట్ల అవినీతి
- ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ

2

## రైతు సంక్షేమమే
# ప్రభుత్వ లక్ష్యం

రుణమాఫీ.. మా చిత్తశుద్ధి, నిబద్ధతకు నిదర్శనం

- ఆగస్టు పదిహేనులోగా మొత్తం ప్రక్రియ పూర్తి చేస్తాం
- దేశ చరిత్రలోనే ఇది రికార్డు
- రైతులను రుణ విముక్తులను చేస్తాం
- గత ప్రభుత్వం చేసిన అప్పులకు ఆరు నెలల్లో రూ.43 వేల కోట్ల వడ్డీ చెల్లించాం
- సీఎం రేవంత్ రెడ్డి
- అసెంబ్లీ ప్రాంగణంలో రెండో విడుత రుణమాఫీ నిధులు విడుదల
- రాష్ట వ్యాప్తంగా రైతులు, కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు



రుణమాఫీ చెక్కును మహిళా రైతులకు అందజేస్తున్న సీఎం రేవంత్, డిప్యూటీ సీఎం, మంత్రులు

**హైదరాబాద్, జూలై 30 (ప్రజాస్వరం) :** తెలంగాణ రైతులకు అసెంబ్లీ ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి రెండో విడత రైతు రుణమాఫీ నిధులు విడుదల చేశారు. ఇప్పటికే రూ.లక్ష ఉన్నవారికి రుణమాఫీ పూర్తి చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 6,40,223 మందికి రూ.6190.01 కోట్లు ఖాతాల్లో జమచేశారు. మూడో విడత కింద 17, 75, 235 మంది రైతులకు రూ.12,224.98 కోట్లు విడుదల చేశారు. ఈ సందర్భంగా సీఎం మాట్లాడుతూ రాజకీయ ప్రయోజనం కాదు.. రైతు ప్రయోజనం ముఖ్యమని అన్నారు. రైతులు సంతోషంగా ఉండాలని 6 మే 2022న వరంగల్ లో రైతు డిక్లరేషన్ ప్రకటించామని.. గత ప్రభుత్వం 60 నెలలు నాలుగు విడతల్లో రూ.లక్ష రుణమాఫీ కూడా పూర్తిచేయలేకపోయిందని గుర్తు చేశారు.

అప్పుల్లో కూరుకుపోయిన తెలంగాణ ప్రభుత్వం ఎలా రుణమాఫీ చేస్తుందని కొందరు మాట్లాడారని.. ఎట్టి పరిస్థితుల్లో రుణమాఫీ చేయాల్సిందేనని ప్రణాళికలు రచించుకుని నిధులు సేకరించామని తెలిపారు. నిధుల సమీకరణ చేసి ఇవాళ రెండో విడతలో రూ.6,198కోట్లు ఆరున్నర లక్షల మందికి మేలు జరిగేలా చేస్తున్నామన్నారు. ఇది మా చిత్తశుద్ధి, ఇది మా నిబద్ధత అని ప్రకటించారు.నెహ్రూ ఆనాడు హరిత విప్లవం తీసుకువచ్చారని.. జై జవాన్, జై కిసాన్ నినాదంతో ఆనాడు కాంగ్రెస్ ప్రభుత్వం మిగతా 2 లో..

## పట్టాలు తప్పిన గూడ్స్

పక్క ట్రాక్ పై పడిన బోగీలు

అదే ట్రాక్ పై వెనుక నుంచి వచ్చి ఢీ కొట్టిన హౌరా మెయిల్

జార్ఖండ్‌లోని చక్రధర్ పూర్ వద్ద ఘటన

రాంచీ, జూలై 30 : నెల రోజుల క్రితం కంచన్ జంగా ఎక్స్‌ప్రెస్ ప్రమాదం జరిగిన ఘటన ఇంకా మరచిపోక ముందే మళ్ళీ రైలు ప్రమాదం చోటు చేసుకుంది. హౌరా నుంచి ముంబై వెళ్తున్న హౌరా మెయిల్ జార్ఖండ్‌లోని చక్రధర్‌పూర్‌లో పట్టాలు తప్పింది. ఈ ప్రమాదంలో మొత్తం 18 బోగీలు పట్టాలు తప్పాయి. దీంతో రైలులో ప్రయాణిస్తున్న పలువురు మిగతా 2 లో..



# ప్రకృతి ప్రకోపం..

- కేరళ రాష్ట్రంలో భారీ వర్షాలు
- వయనాడ్ జిల్లాలో విరిగిపడిన కొండ చరియలు
- మంగళవాళం తెల్లవారు జామున ఘటన
- ఇప్పటివరకు 123 మంది మృతి
- వరద, బుదరలో గల్లంతైన వందల మంది
- శిథిలాల కింద చిక్కుకుపోయిన మరికొంత మంది
- రెస్క్యూ ఆపరేషన్ చేపట్టిన ఆర్మీ, ఎన్డీఆర్ఎఫ్
- డ్రోన్లు, జాగిలాలతో అన్వేషణ
- నేడు, రేపు సంతాప దినాలు

తిరువనంతపురం, జూలై 30: కేరళలోని వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడటంతో పెను విషాదం నెలకొంది. స్థానికుల సమాచారం మేరకు వందలాది మంది ఇంకా శిథిలాల్లో ఉన్నారు. వయనాడ్ జిల్లాలోని మెప్పాడి, ముండక్కై పట్టణం, చురాల్ మాల ప్రాంతాల్లో మంగళవారం తెల్లవారుజామున ప్రకృతి తన విశ్వరూపాన్ని ప్రదర్శించింది. కొండచరియలు విరిగిపడటంతో దాదాపు 123 మృత్యువాత పడ్డారు. ఇంకా వందల మంది శిథిలాల్లో చిక్కుకొని ఉన్నారు. వారి కోసం గాలింపు చర్యలు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. 100 మంది వరకు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నారు. గల్లంతైన వారి కోసం గాలింపు చర్యలు శరవేగంగా సాగుతున్నాయని ఆరోగ్య శాఖ మంత్రి వీణా జార్జ్ తెలిపారు. చురల్‌మలా గ్రామం పూర్తిగా ధ్వంసమైంది. కొండచరియల్లో 400 మంది కుటుంబాలు చిక్కుకున్నాయి. ఘటనాస్థలికి వెళ్లే రోడ్డు మార్గాలు ధ్వంసం అయ్యాయి. వరదలో మృతదేహాలు కొట్టుకువస్తున్నాయి. భారీ వర్షాల కారణంగా సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. వయనాడ్ లోయ ప్రాంతాలకు రెడ్ అలర్ట్ జారీ అయింది.కేరళలో భారీవర్షాల బీభత్సం ఎలా ఉందో చూపే దృశ్యమిది. భీకర వర్షాలకు రైల్వేట్రాక్స్ దెబ్బతింటున్నాయి. వలతోల్ నగర్, వడకంచెరి మధ్య ఒక రైల్వేలైన్‌మీదకు వరద పోటెత్తింది. దీంతో స్టేషన్ వాచ్‌మన్ రైలును ఆపేశాడు. సహాయక చర్యల కోసం ఎయిర్‌ఫోర్స్ రంగంలోకి దిగింది. రెండు హెలికాప్టర్లు సహాయకచర్యలకు బయల్దేరాయి. మరోవైపు కేరళ సీఎం పినరయ్ విజయన్ సహాయచర్యలను పర్యవేక్షిస్తున్నారు.మరోవైపు ఈ దారుణ ఘటనలో వందలాది మంది శిథిలాల కింద చిక్కుకుపోయి ఉంటారని భావిస్తున్నారు. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ అథారిటీ బాధిత ప్రాంతంలో ఫైర్ ఫోర్స్ ఎన్డీఆర్ఎఫ్ బృందాలను మోహరించినట్లు తెలిపింది. అలాగే ఎన్డీఆర్ఎఫ్ మరో బృందం వాయనాడ్ చేరుకుంది. సైన్యం కూడా బాధ్యతలు చేపట్టింది. సహాయక చర్యలు శరవేగంగా జరుగుతున్నాయి.

**మోదీ భరోసా**

వయనాడ్‌లో జరిగిన దుర్ఘటనపై ప్రధానమంత్రి నరేంద్ర మోదీ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ప్రమాదంలో మృతుల కుటుంబాలకు రూ.2 లక్షల పరిహారం అందజేయనున్నట్టు ప్రకటించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యసాయం అందాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి చేయూత ఇచ్చేందుకు సిద్ధంగా ఉన్నామని ప్రకటించారు. కేరళలో కొండచరియలు విరిగిపడిన ఘటన తనను కలచివేసిందని ప్రధాని మోదీ అన్నారు. ఆత్మీయులను కోల్పోయిన వారందరికీ ప్రగాఢ సానుభూతి తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నాను అన్నారు. ప్రస్తుతం బాధితులందరినీ ఆదుకునేందుకు సహాయక చర్యలు కొనసాగుతున్నాయని తెలిపారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌తో మాట్లాడానని, అన్ని విధాలా సహాయం అందిస్తామని హామీ ఇచ్చారు.పరిహారాన్ని కూడా ప్రధాని మోదీ ప్రకటించారు. వయనాడ్‌లో కొండచరియలు విరిగిపడి ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు పీఎంఎన్ఆర్ఎఫ్ నుంచి 2 లక్షల ఎక్స్ గ్రేషియా ఇస్తామన్నారు. క్షతగాత్రులకు రూ.50వేలు పరిహారం అందజేస్తామన్నారు.



**రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి**

కేరళలో కొండచరియలు విరిగిపడిన దుర్ఘటనపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. 'వయనాడ్‌లోని మెప్పాడి సమీపంలో కొండచరియలు విరిగిపడటం నన్ను తీవ్రంగా కలచివేసింది. ఆత్మీయులను కోల్పోయిన వారి కుటుంబాలకు నా ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తున్నాను అన్నారు. ఇంకా శిథిలాల్లో చిక్కుకుపోయిన వారిని త్వరలోనే సురక్షితంగా బయటకు వస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు.కేరళ ముఖ్యమంత్రి, వయనాడ్ జిల్లా కలెక్టర్‌తో మాట్లాడానని, సహాయక చర్యలు కొనసాగుతున్నాయని అన్నారు. అన్ని ఏజెన్సీలతో సమన్వయం చేసుకోవాలని, కంట్రోల్ రూం ఏర్పాటు చేయాలని, సహాయక చర్యలకు అవసరమైన సహాయం గురించి తెలియజేయాలని కోరారు. కేంద్రమంత్రులతో మాట్లాడి వయనాడ్‌కు అన్ని విధాలా సాయం అందించాలని కోరతాను అన్నారు. సహాయక చర్యల్లో అధికార యంత్రాంగానికి సహకరించాలని యూడీఎఫ్ కార్యకర్తలందరికీ రిక్వస్ట్ చేశారు.
భారీ వర్షాల ముంచెత్తడంతో ముండక్కై పట్టణంలో తెల్లవారుజామున ఒంటిగంట సమయంలో మొదట కొండచరియలు విరిగిపడ్డాయి. అక్కడ సహాయక చర్యలు చేపడుతున్న టైంలోనే చురల్ మాలలో మరో ప్రమాదం జరిగింది. సుమారు 4 గంటల ప్రాంతంలో చురల్ మాలలోని పాఠశాల సమీపంలో కొండచరియలు విరిగిపడ్డాయి. వరదబాధితుల కోసం ఏర్పాటు చేసిన శిబిరంతోపాటు సమీపంలోని ఇళ్లు, దుకాణాలన్నీ నీరు, బురదతో నిండిపోయాయి.

**హెల్ప్ లైన్ కేంద్రాలు ఏర్పాటు**

బాధితుల కోసం 9656938689, 8086010833 హెల్‌లైన్‌లు ఏర్పాటు చేసింది కేరళ ప్రభుత్వం. అన్ని విధాల ప్రజలకు ఆదుకునేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని ప్రకటించింది. వైమానిక దళం, రాష్ట్ర సహాయక బృందాలు అన్నీ కూడా ప్రస్తుతం సహాయక చర్యల్లో నిమగ్నమై ఉన్నాయని తెలిపింది. రెండు ఐఏఎఫ్ హెలికాప్టర్లు ఎంఐ-17, ఒక ఏఎల్‌హెచ్‌ను రంగంలోకి దించి గల్లంతైన వారి ఆచూకీ కోసం గాలింపుచర్యలు చేపట్టినట్టు పేర్కొంది. గాయపడిన వారికి మెరుగైన వైద్యం కొండచరియలు విరిగిపడిన ఘటనలో క్షతగాత్రులకు మెరుగైన చికిత్స అందచేస్తున్నామని ఆరోగ్య మంత్రి వీణా జార్జ్ తెలిపారు. రాష్ట్రంలోని అన్ని వసతులు ఉన్న ఆసుపత్రులను లైన్‌లో పెట్టినట్టు పేర్కొన్నారు. అందరి సేవలు వినియోగించుకుంటున్నామని వివరించారు. వర్తిరి, కల్పత్త, మేప్పాడి, మనంతవాడి ఆసుపత్రులతో సహా అన్ని ఆసుపత్రుల్లో రోగులకు చికిత్స చేయడానికి సంసిద్ధంగా ఉంచామన్నారు. రాష్ట్రంలోని ఆరోగ్య కార్యకర్తలందరూ సేవలు అందించేందుకు తరలి వస్తున్నారని ఆయా ఆసుపత్రుల్లో వారికి విధులు కేటాయించినట్టు ప్రకటించారు.
వయనాడ్ చేరుకున్న కేరళ మంత్రులు కొండచరియలు ప్రాంతాలో జరిగే సహాయకచర్యలను నేరుగా మంత్రులు పర్యవేక్షిస్తున్నారు. సహాయక చర్యలను సమన్వయం చేస్తామని, సహాయక చర్యలకు నేతృత్వం వహించడానికి మంత్రులు వయనాడ్ చేరుకున్నట్టు సీఎం ప్రకటించారు. వయనాడ్ జిల్లాలో కొండచరియలు విరిగిపడటం, వర్షాల కారణంగా సంభవించిన విపత్తుల దృష్ట్యా ఆరోగ్య శాఖ (నేషనల్ హెల్త్ మిషన్) కంట్రోల్ రూమ్ స్టార్ట్ చేసినట్టు వెల్లడించారు.

**కేరళలో మూడు రోజులు వర్షాలు**

కేరళలో ఇప్పటికే వర్షాలకో ఇబ్బంది పడుతున్న జనాలకు వాతావరణ శాఖ మరో షాకింగ్ న్యూస్ చెప్పింది. ఇంకా వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. చాలా చోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని ఐఎండీ పేర్కొంది. కొన్ని చోట్ల భారీ నుంచి అతిభారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హెచ్చరించింది. ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో కూడిన వర్షాలు కురిసే అవకాశం ఉంది. వయనాడ్‌లో కూడా వర్షం కురిసే అవకాశం ఉందని, దీని వల్ల సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడే అవకాశం ఉందన్నారు. పెరిగిన వాయనాడ్ మృతుల సంఖ్య

**తమిళనాడు సీఎం రూ. 5 కోట్ల సాయం**

చెన్నై జూలై 30 : కేరళలోని వాయనాడ్ లో కొండచరియలు విరిగిపడ్డంతో తాజాగా మృతుల సంఖ్య 123కు పెరిగింది. దాదాపు 116 మంది గాయపడ్డారు. వాయనాడ్ కేరళ లోని కొండ ప్రాంతం. ఇప్పటికీ చాలా మంది శిథిలాల క్రింద ఉన్నట్లు సమాచారం. మృతుల సంఖ్య కూడా పెరిగే అవకాశం ఉంది. ఇదిలావుండగా తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె.స్టాలిన్ సీఎం జనరల్ రిలీఫ్ ఫండ్ నుంచి రూ. 5 కోట్లను కేరళకు కేటాయించారు. అంతేకాకుండా కేరళకు తమిళనాడు నుంచి విపత్తు దళాలు, డాక్టర్లను, నర్సులను, ఇద్దరు ఐఏఎస్ అధికారులను రెస్క్యూ టీమ్ గా పంపారు. కేరళకు కావలసిన సాయం అందిస్తామని హామీ ఇచ్చారు. ఇదిలావుండగా 200 మంది భారతీయ సైనిక సిబ్బంది, 30 మంది నావీ ఈతగాళ్లు కూడా కేరళకు చేరారు. వారంతా రెస్క్యూ కార్యక్రమాలలో పాలుపంచుకుంటారు.



## రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ప్రభుత్వం ముందుకెళ్లిందని రేవంత్ తెలిపారు. పేద రైతులకు తక్కువ వడ్డీకి రుణాలు అందించేందుకు ఇందిరమ్మ బ్యాంకుల జాతీయకరణ చేశారని.. సోనియమ్మ నేతృత్వంలో ఆనాడు ఆహార భద్రత చట్టం తీసుకువచ్చారని తెలిపారు.

ఆనాడు రూ.72వేల కోట్లు రుణాలు మాఫీ చేసి దేశంలో రైతులను ఆదుకుంది కాంగ్రెస్ అని గుర్తు చేశారు. అప్పుడు .. ఇప్పుడు ఎప్పుడూ కాంగ్రెస్ రైతు పక్షపాతేనన్నారు. నెల తిరిగేలోగా 1.5లక్షల వరకు రైతు రుణమాఫీ చేసి మా చిత్తశుద్ధి నిరూపించుకున్నామని.. అగస్టులోగా రూ.2లక్షల రుణమాఫీ పూర్తి చేసి రైతులను రుణ విముక్తులను చేస్తామన్నారు. జూలై, ఆగస్టు నెలలు చరిత్రలో లిఖించదగ్గ నెలలు. దేశ చరిత్రలోనే తెలంగాణ ప్రభుత్వం చేపట్టిన రైతు రుణమాఫీ రికార్డు సృష్టించిందన్నారు. స్వతంత్ర భారతంలో ఇప్పటి వరకు ఏ రాష్ట్రం కూడా ఇంత పెద్దమొత్తంలో రైతు రుణమాఫీ చేయలేదని.. గత బీఆరెస్ ప్రభుత్వం చేసిన అప్పులకు ఈ ఆరునెలల్లో ఆర్థిక మంత్రి రూ.43 వేల కోట్లు వడ్డీ చెల్లించారని ఆరోపించారు. 12 రోజుల్లోనే రుణమాఫీకి 12వేల కోట్లు సేకరించిన ఆర్థిక మంత్రి, వారి సిబ్బందిని అభినందిస్తున్నానన్నారు. అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్నందున రైతు రుణమాఫీ నిధులు విడుదల చేసేందుకు అసెంబ్లీలోనే ప్రత్యేక కార్యక్రమం ఏర్పాటు చేశారు. రైతులు, పంట పొలాలు, పంటలకు సంబంధించిన అంశాలతో ఆకర్షణీయంగా ఏర్పాటు చేసిన సభా వేదికపై నుంచి కార్యక్రమం పూర్తి చేశారు.

**రైతులకు రుణమాఫీ చారిత్రాత్మకం : మంత్రి పొన్నం**

తెలంగాణ లో కాంగ్రెస్ ప్రభుత్వం చారిత్రాత్మకంగా దేశంలో ఏ ప్రభుత్వం చేపట్టని విధంగా రైతులకు 2 లక్షల రుణమాఫీ చేసే దానిలో క్యాబినెట్ మంత్రిగా భాగస్వామ్యం ఉండడం నా జీవి తంలో మరపురాని ఘట్టమని మంత్రి పొ న్నం ప్రభాకర్ అన్నారు. రాహుల్ గాంధీ ఆలోచనతో ఈ నిర్ణయం తీసుకున్న ముఖ్యమంత్రి ,ఉప ముఖ్యమంత్రి సహచర మంత్రులు, ఎమ్మెల్యేలు ఎమ్మెల్సీల సహ కారంతో ఈ కార్యక్రమం జరిగింది. రైతన్న లంత ఈ రాష్ట్ర అభివృద్ధిలో మరింత పంట ల ఉత్పత్తి ద్వారా ఆర్థికంగా ఎదగడానికి రుణమాఫీ ఎంతగానో ఉపయోగ పడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. రైతన్నలందరికీ హృదయ పూర్వక శుభాకాంక్షలు తెలిపారు.




రెండో విడుత రుణమాఫీ కార్యక్రమంలో మాట్లాడుతున్న సీఎం రేవంత్ రెడ్డి

## విద్యుత్ కమిషన్ కొత్త చైర్మన్‌గా మదన్ బి లోకూర్

**హైదరాబాద్, జూలై 30 (ప్రజాస్వరం):** తెలంగాణలో గత ప్రభుత్వ విద్యుత్ అవకతవకలపై విచారణకు ఏర్పాటు చేసిన కమిషన్ కు కొత్త చైర్మన్ గా సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి, ఉమ్మడి ఏపీకి కూడా చీఫ్ జస్టిస్ గా పని చేసిన మదన్ బి లోకూర్ నేతృత్వం వహించనున్నారు. మొదట ఈ కమిషన్ కు జస్టిస్ నరసింహారెడ్డి నేతృత్వం వహించారు. అయితే ఆయనపై కేసీఆర్ సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆయన మీడియాతో మాట్లాడారని.. ముందుగానే తన అభిప్రాయం చెప్పారని పిటిషన్ లో పేర్కొన్నారు. విచారణ జరిపిన సుప్రీంకోర్టు.. జస్టిస్ నరసింహారెడ్డి స్థానంలో కొత్త చైర్మన్ ను నియమించాలని ఆదేశించింది. ఈ మేరకు తెలంగాణ ప్రభుత్వం జస్టిస్ మదన్ బి లోకూర్ ను నియమించాలని నిర్ణయించింది. జస్టిస్ మదన్ బి లోకూర్ సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా పలు కీలక కేసుల్లో తీర్పును వెలువరించారు. 1953, డిసెంబర్ 31న జన్మించిన లోకూర్, 1977, జూలై 28న న్యాయవాదిగా పేరును నమోదు చేయించుకున్నారు. 2010-12 మధ్యకాలంలో గువాహటి, ఏపీ హైకోర్టు ప్రధాన న్యాయమూర్తిగా విధులు నిర్వర్తించారు. 2012 జూన్ లో సుప్రీంకోర్టు న్యాయమూర్తిగా జస్టిస్ లోకూర్ నియమితులయ్యారు. భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి(సీజేఐ)తో కలిసి 47 కేసుల్లో కీలక తీర్పులు ఇచ్చారు. అప్పటి సీజేఐ జస్టిస్ దీపక్ మిశ్రా వ్యవహారశైలికి వ్యతిరేకంగా మీడియా సమావేశం ఏర్పాటుచేసిన నలుగురు జడ్జీల్లో జస్టిస్ లోకూర్ ఒకరుబీఆర్ఎస్ హయాంలో విద్యుత్ కొనుగోళ్ల వ్యవహారం.. భద్రాద్రి, యాదాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రాల నిర్మాణం తదితర అంశాలపై కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో విచారణ నిర్వహించాలని నిర్ణయించారు. విశ్రాంత న్యాయమూర్తి జస్టిస్ ఎల్. నర్సింహారెడ్డి నేతృత్వంలో కమిషన్ ఏర్పాటు చేశారు. కమిషన్ విద్యుత్ కొనుగోలు ఒప్పందాల్లో కేసీఆర్ పాత్రపై కమిషన్ వివరణ కోరింది. తనను విచారణకు పిలవకూడదంటూ కేసీఆర్ తెలంగాణ హై కోర్టును ఆశ్రయించారు. కమిషన్ చైర్మన్ చట్ట విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ముందే నిర్ణయానికి వచ్చినట్లుగా ప్రెస్ మీట్లు పెడుతున్నారని కోర్టుదృష్టికి తీసుకెళ్లారు. సుప్రీంకోర్టుకు వెళ్లే ముందు హైకోర్టును ఆశ్రయించారు. అక్కడ అనుకూల ఫలితం రాకపోవడంతో సుప్రీంకోర్టును ఆశ్రయించారు. సుప్రీంకోర్టు విచారణ కమిషన్ ను మార్చాలని ఆదేశించింది.మదన్ బి లోకూర్ మళ్లీ మొదటి నుంచి విచారణ జరిపే అవకాశం ఉంది. ఏ ఏ అంశాలపై జస్టిస్ నరసింహారెడ్డి విచారణ జరుపుతారో అదే అంశాలపై.. నదన్ బి లోకూర్ విచారణ కొనసాగించనున్నారు.

## సీఎం రేవంత్‌కు షాక్

**బీఆర్ఎస్ఎల్పీలో కేటీఆర్‌ను కలిసిన గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి**

**తిరిగి పార్టీలో కొనసాగుతానని చెప్పినట్టు సమాచారం**

**మరో ముగ్గురు ఎమ్మెల్యేలు తిరిగి కారు ఎక్కుతారని ప్రచారం**

**హైదరాబాద్, జూలై 30 (ప్రజాస్వరం):** కొద్ది రోజుల కిందట కాంగ్రెస్ పార్టీలో చేరిన గద్వాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి మళ్లీ భారత రాష్ట్ర సమితి వైపు చూస్తున్నారు. అసెంబ్లీలోని బీఆర్ఎస్ఎల్పీ కార్యాలయంలో ఆయన కేటీఆర్ ను కలిశారు. ఆ దృశ్యాలు వైరల్ అయ్యాయి. తాను బీఆర్ఎస్ లోనే కొనసాగుతానని కృష్ణమోహన్ రెడ్డి కేటీఆర్ కు చెప్పినట్లుగా బీఆర్ఎస్ వర్గాలు చెబుతున్నాయి. త్వరలో కేసీఆర్ ను కలుస్తానని కృష్ణమోహన్ రెడ్డి చెబుతున్నారు. వరుసగా రెండు సార్లు బీఆర్ఎస్ నుంచి గెలపొందిన బండ్ల కృష్ణమోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ పార్టీ వైపు చూశారు. రేవంత్ రెడ్డితో సమావేశమై.. నియోజకవర్గ అభివృద్ధి కోసం హామీలు తీసుకున్న తర్వాత కాంగ్రెస్ పార్టీలో చేరారు. అయితే స్థానికంగా ఆయనకు వర్గ పోరు అధికమయింది. గత ఎన్నికల్లో కాంగ్రెస్ తరపున పోటీ చేసిన సరితా తిరుపతయ్య వర్గం ఆయన రాకను తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. ఒకప్పుడు బీఆర్ఎస్ లోనే కీలక నేతగా ఉన్న సరితా తిరుపతయ్యా.. తర్వాత బండ్ల కృష్ణమోహన్ రెడ్డితో విబేధించి కాంగ్రెస్ లో చేరారు.ఎమ్మెల్యే కృష్ణమోహన్ రెడ్డి చేరినా ప్రాధాన్యత తగ్గబోదని సరితా తిరుపతయ్యను రేవంత్ రెడ్డి బుజ్జగించి పార్టీలో చేరికలను కొనసాగించారు. అయితే కాంగ్రెస్ లో చేరితే.. అటు తన క్యాడర్ కు ఇటు కాంగ్రెస్ క్యాడర్ కూ కాకుండా పోయినట్లు అవుతుందన్నట్లుగా కృష్ణమోహన్ రెడ్డి పరిస్థితి ఉండటంతో ఆయన పునరాలోచనలో పడ్డారు. పార్టీలో చేరేటప్పుడు ఇచ్చిన ప్రాధాన్యం.. చేరిన తర్వాత ఇవ్వడం లేదని ఫీలవుతున్నారు. పార్టీ మారి తప్పు చేశా మా అన్న పరిస్థితికి రావడంతో వీలైనంత ఎక్కువగా వెనక్కి వెళ్లేందుకు ప్రయత్నిస్తు న్నట్లుగా తెలుస్తోంది. బీఆర్ఎస్ ఎల్పీని విలీనం చేసుకునేలా రాజకీయ వ్యూహం ఖరారు చేసిన రేవంత్ రెడ్డికి దానిని అమలు చేయడంలో మాత్రం.. ఇబ్బందులు పడుతున్నారు. చేరిన వారు కూడా వెనక్కి పోతూండటం ఆసక్తికరంగా మారింది.

## వికసిత్ భారత్ లక్ష్యంగా పనిచేస్తున్నాం

**త్వరలో భారత్ మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా అవతరిస్తుంది**

**ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ**

న్యూ ఢిల్లీ జూలై 30 : 2014కు ముందు యూపీఏ ప్రభుత్వం ఆర్థిక వ్యవస్థ మెరుగ్గా ఉందని చూపేందుకు బడ్జెట్ లో భారీ ప్రకటనలు గుప్పించేదని, క్షేత్రస్థాయిలో వాటి అమలును పట్టించుకోలేదని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. వికసిత్ భారత్ దిశగా ప్రస్థానం అనే అంశంపై కేంద్ర బడ్జెట్ 2024-25పై సీఐఐ నిర్వహించిన సదస్సులో ప్రధాని ప్రారంభోపన్యాసం చేశారు. పథకాలను పూర్తి చేసేందుకు గత ప్రభుత్వాలు శ్రద్ధ కనబరచలేదని దుయ్యబట్టారు. గత పదేండ్లుగా తాము ఆ పరిస్థితిని మార్చివేశామని ప్రధాని పేర్కొన్నారు. గత ప్రభుత్వ హయాంతో పోలిస్తే తాము రైల్వే బడ్జెట్ ను 8 రెట్లు , హైవేల బడ్జెట్ ను 8 రెట్లు, వ్యవసాయ బడ్జెట్ ను 4 రెట్లు, రక్షణ బడ్జెట్ ను రెండింతలు పైగా పెంచామని చెప్పారు. యూపీఏ హయాంలో లక్షలాది కోట్ల రూపాయల విలువైన అవినీతి కుంభకోణాలు వెలుగుచూసిన విషయం అందరికీ తెలిసిందేనని అన్నారు. తాము శ్వేతపత్రం రూపంలో దేశ ఆర్థిక వ్యవస్థ ముఖచిత్రాన్ని దేశ ప్రజల ముందుంచామని చెప్పారు. మనం ఎక్కడ ఉన్నామనేదానిపై చర్చ జరగాలని చెప్పారు. భారత పరిశ్రమలను నూతన శిఖరాలకు చేర్చామని తెలిపారు. దేశ అభివృద్ధికి మూలధన వ్యయం కీలకమని 2004లో యూపీఏ తొలి బడ్జెట్ లో మూలధన వ్యయం కేవలం రూ. 90,000 కోట్లు కాగా, ఇప్పుడు తమ ప్రభుత్వం రూ. 11 లక్షల కోట్లు పైగా మూలధన వ్యయం వెచ్చిస్తోందని ఈ నిధులతో దేశంలో మౌలిక సదుపాయాల ప్రాజెక్టులను అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఇవాళ మనం వికసిత్ భారత్ దిశగా పయనిస్తున్నామని, ఈ మార్పు కేవలం సెంటిమెంట్లతో రాలేదని, ఆత్మవిశ్వాసంతోనే సాధ్యమైందని అన్నారు. భారత్ త్వరలో మూడో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఆవిర్భవిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.



## మనూ డబుల్ ధమాకా

- ఒకే ఒలంపిక్స్‌లో రెండు పతకాలు సాధించిన బాకర్
- వ్యక్తిగత, మిక్స్ డ్ షూటింగ్ విభాగాల్లో కాంస్యం
- తొలి భారతీయ క్రీడాకారిణిగా రికార్డు
- అభినందనలు తెలిపిన ప్రధాని మోదీ

పారిస్ జూలై 30 : భారత షూటర్ మనూ భాకర్ చరిత్ర సృష్టించింది. ఒకే ఒలింపిక్స్ లో రెండు పతకాలు గెలిచిన తొలి భారతీయ క్రీడాకారిణిగా ఆమె రికార్డు క్రియేట్ చేసింది. మనూ బాకర్ తొలుత మహిళల 10మీటర్ల ఎయిర్ పిస్తోల్ ఈవెంట్ లో, తర్వాత 10 మీటర్ల ఎయిర్ పిస్తోల్ మిక్స్ డ్ ఈవెంట్ లో కాంస్య పతకాలు గెలిచింది. గతంలో ఇండియా తరపున ఒకే ఒలింపిక్స్ లో రెండు మెడల్స్ సాధించిన అథ్లెట్లలో నార్మన్ ప్రిచార్డ్ ఉన్నారు. 1900 సంవత్సరంలో జరిగిన పారిస్ ఒలింపిక్స్ లోనే అతను ఆ రికార్డును సాధించారు. 200 మీటర్ల హార్డిల్స్, 200 మీటర్ల రేస్ లో నార్మన్ ప్రిచార్డ్ సిల్వర్ పతకాలు గెలుచుకున్నాడు.

## పట్టాలు తప్పిన గూడ్స్

(మొదటి పేజీ తరువాయి)

ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో 18 మంది చిన్నారులు కూడా ఉన్నట్లు సమాచారం. ఈ ప్రమాదంలో కొందరు మృతి చెంది ఉండవచ్చని ఆందోళన వ్యక్తం అవుతోంది. అయితే రైల్వే సిబ్బంది, స్థానిక పోలీసులు ఇంకా మరణాలను ధృవీకరించలేదు. మంగళవారం తెల్లవారుజామున 3.30 గంటల ప్రాంతంలో రాజ్‌ఖర్‌స్వాన్, బడాబాంబో మధ్య ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదం జరిగిన సమయంలో హౌరా మెయిల్ పశ్చిమ బెంగాల్‌లోని హౌరా నుంచి సీఎస్ఎంటీ ముంబైకి వెళ్తోంది. రైల్వే అధికారులు తెలిపిన వివరాల ప్రకారం ఈ రైలు రాజ్‌ఖర్స్వాన్ నుంచి బడాబాంబో వైపు వెళ్తున్న సమయంలో జార్ఖండ్‌లో రైలు ప్రమాదం జరిగింది. చక్రధర్‌పూర్‌లో పట్టాలు తప్పిన గూడ్స్ రైలు మరో ట్రాక్‌పైకి గూడ్స్ రైలు బోగీలు ఒరిగిపోయాయి. ఇంతలో వెనుక నుంచి అదే లైన్ లోకి వచ్చిన హౌరా-ముంబై మెయిల్ బోగీలను ఢీకొంది. ప్రమాదంలో మొత్తం బోగీలు పట్టాలు తప్పాయి. అయితే హౌరా మెయిల్ డ్రైవర్ ఈ ప్రమాదాన్ని సకాలంలో గ్రహించాడు.. తెలివిగా వ్యవహరించి హౌరా ముంబై రైలుకి జరగాల్సిన ఘోర ప్రమాదాన్ని నివారించినట్లు తెలుస్తోంది. డ్రైవర్ తెలివి కారణంగానే ప్రయాణికులెవరూ మరణించలేదని తెలుస్తోంది.

## సీఎం సభను తప్పుదోవ పట్టిస్తున్నారు

**మేడిగడ్డ ఎత్తిపోతల రిపోర్టును తప్పుగా చదివారు**

**పోతిరెడ్డిపాడుపై ఆరోపణల్లో వాస్తవం లేదు**

**ఒక్కనాడైనా జై తెలంగాణ అనలేదు**

**మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్ రావు మండిపాటు**

**హైదరాబాద్, జూలై 30 (ప్రజాస్వరం):** మందబలంతో కుర్చీలో కూర్చొని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి శాసనసభను తప్పుదోవ పట్టిస్తున్నారని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు విమర్శించారు. ఆయన అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మేడిగడ్డ నుంచి వాటర్ లిఫ్టింగ్ వ్యవహారంలో రిటైర్డ్ ఇంజినీర్‌ల రిపోర్టులను తప్పుగా చదివారని ఆరోపించారు. మోటర్లకు మీటర్లు అంటూ లెటర్‌లైన్ మొత్తాన్ని తప్పించి చదివి అబద్ధాలు చెప్పారన్నారు. ఉదయ్ స్కీమ్‌తో రూ.30 వేలకోట్లు వస్తుండే అని చెప్పే టైమ్‌లో సీఎం కలుగజేసుకొని ఆఫీసర్లు సంతకాలు పెట్టారని లెటర్ చదివారన్నారు. మందబలంతో శాసనసభను తప్పుదోవ పట్టిస్తున్నారన్నారు. పోతిరెడ్డిపాడును దగ్గరుండి బొక్క పెట్టించారని అని రేవంత్ ఆరోపణ చేస్తున్నారని. ఉమ్మడి రాష్ట్రంలో తాము రాజీనామా చేసిన తర్వాతనే పోతిరెడ్డిపాడుకు జీవో విడుదలైందన్నారు. పులిచింతల ప్రాజెక్టు, నక్సలైట్లతో చర్చలు తెలంగాణ ప్రయోజనాల కోసం ఆనాడు 2005లో మంత్రి పదవులను ఒదులుకున్నామన్నారు.
కోమటిరెడ్డి రాజగోపాల్ ఎల్ఆర్ఎస్ ఉచితంగానే చేయాలని గతంలో కోర్టులో కేస్ వేశారని గుర్తు చేశారు. ఎల్ఆర్ఎస్‌కు డబ్బులు వసూలు చేయాలని కేబినెట్‌లో నిర్ణయం తీసుకున్నారన్నారు. ఇప్పుడేమో రూ.14వేలు ఉన్న ఎల్ఆర్ఎస్ ధరలను రూ.18వేలకు పెంచి వసూలు చేద్దాం అనుకుంటున్నారన్నారు. ఆనాడు తెలంగాణ రాష్ట్ర సాధన కోసం రాజీనామాకు సిద్ధపడితే రేవంత్ జిరాక్స్ పేపర్ కూడా స్పీకర్‌కు ఇవ్వలేదని విమర్శించారు. తెలంగాణకు వ్యతిరేకంగా రైఫిల్ పట్టుకుని బెదిరించిన వ్యక్తి.. రైఫిల్ రెడ్డి అయ్యాడన్నారు. ఒక్కనాడైన జై తెలంగాణ అనని వ్యక్తి రేవంత్‌రెడ్డి అన్నారు. కేసీఆర్ పుణ్యం, దయతోనే రేవంత్ పదవులను అనుభవించాడన్నారు.
బీఆర్ఎస్ పని ఖతం అంటున్నారని. ఎన్నటికైనా మళ్లీ బీఆర్ఎస్ వస్తుందన్నారు. 1984 తర్వాత నుంచి ఇప్పటి వరకు కాంగ్రెస్‌కు ఫుల్ మెజారిటీ రాలేదని. పొత్తులతోనే నెట్టుకొస్తోందని విమర్శించారు. చీమలు పెట్టిన పుట్టలో పాములు వెళ్లినట్టు అసలు కాంగ్రెస్ వాళ్లకు పదవులు లేవంటూ ధ్వజమెత్తారు.



# రైతును రాజు చేయడమే లక్ష్యం

## జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్





**మెదక్, జులై 30 (ప్రజా స్వరం) :**

తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశ పెట్టిన రుణమాఫీ 2024లో భాగంగా రెండు లక్షల లోపు రుణాలు కలిగిన రైతుల ఖాతాల్లో రుణమాఫీ నిధులు విడుదల చేసినట్లు జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. మంగళవారం మెదక్ జిల్లా కలెక్టరేట్ కార్యాలయంలో రుణమాఫీ రెండో విడతలో భాగంగా లక్ష యాభై వేల లోపు పంట రుణం కలిగిన రైతులకు నిధుల విడుదల కార్యక్రమం సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. ఇందులో భాగంగా ఈ కార్యక్రమం సమీకృత కలెక్టర్ భవన సముదాయం మీటింగ్ హాల్ నందు రైతులతో సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా కలెక్టర్ రాహుల్ రాజ్ పాల్గొని ప్రసంగించారు. ప్రభుత్వం రైతును రాజు చేయాలనే ఉద్దేశంతో రైతుకు సరైన సమయంలో రుణమాఫీ చేయడం ద్వారా తన పెట్టుబడి ఖర్చులకు, ఎరువులు పురుగు మందుల అవసరాలకు రుణమాఫీ నిధులు పనికి వస్తాయన్నారు. క్షేత్ర స్థాయిలోని రైతులను రుణ విముక్తి చేయాలనే సదుద్దేశంతో ప్రభుత్వం కృత నిశ్చయంతో రుణమాఫీ నిధులను విడుదల చేయడం జరిగిందన్నారు. రెండు లక్షల లోపు రుణాలు కలిగిన రైతులకు కూడా త్వరలోనే నిధులు విడుదల చేస్తామన్నారు. ఇప్పటి వరకు మొదటి విడతలో భాగంగా జిల్లాలోని 47,968 మంది రైతులకు 238.81 కోట్లు నిధులు జమ కావడం జరిగిందన్నారు. ముఖ్యమంత్రి జిల్లాలోని 21,517 మంది రైతులకు 202.98 కోట్ల నిధులు విడుదల చేశారు. రెండు విడతల్లో జిల్లా వ్యాప్తంగా 69,495 మంది రైతుల కు 441.79 కోట్ల నిధులు జమ కావడం జరిగిందన్నారు. రుణమాఫీకి సంబంధించిన ఎలాంటి సందేహాలు ఉన్న ఫిర్యాదులున్న క్షేత్ర స్థాయిలో వ్యవసాయ విస్తీర్ణాధికారి మండల స్థాయిలో మండల వ్యవసాయ అధికారి జిల్లా స్థాయిలో జిల్లా వ్యవసాయ అధికారి కార్యాలయాల్లో ప్రత్యేక ఫిర్యాదు విభాగాలు ఏర్పాటు చేయడమైందన్నారు. అర్హత కలిగిన ప్రతి రైతుకు రుణమాఫీ అందే విధంగా పటిష్ట చర్యలు చేపడుతున్నామన్నారు. రైతులు ఎలాంటి అపోహలకు పోకుండా తమకు రుణమాఫీ సంబంధించిన సందేహాలను వ్యవసాయ శాఖ అధికారుల ద్వారా నివృత్తి చేసుకోవాలని కోరారు. అదే విధంగా రుణమాఫీ జరిగిన రైతుల ఖాతాలను రెన్యువల్ చేసి రైతులకు కావాల్సిన డబ్బులను వెంటనే విడుదల చేయాలని బ్యాంకర్లను కోరారు. క్షేత్రస్థాయిలో వ్యవసాయ శాఖ అధికారులు అందుబాటులో ఉంటూ రైతులకు రుణమాఫీకి సంబంధించిన సందేహాలను నివృత్తి చేస్తూ రుణమాఫీలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా రైతులకు, బ్యాంకు అధికారులకు మధ్య సమన్వయపరదాలని వ్యవసాయ శాఖ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు, జిల్లా వ్యవసాయ అధికారి గోవింద్, జిల్లా సహకార శాఖ అధికారి కరుణ, లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ మూర్తి, జిల్లా వ్యాప్తంగా ప్రాథమిక సహకార సంఘం చైర్మన్లు, అదనపు వ్యవసాయ సహాయ సంచలకులు, మండల వ్యవసాయ అధికారులు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు, ప్రాథమిక సహకార సంఘం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.



## రైతు బాంధవుడు సీఎం రేవంత్‌రెడ్డి

**- మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్**
**- గజ్వేల్‌లో కాంగ్రెస్ శ్రేణుల సంబురాలు**

**గజ్వేల్, జులై 30(ప్రజా స్వరం) :**

సిద్దిపేట జిల్లా గజ్వేల్ రైతు వేదిక వద్ద మంగళవారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో రైతులతో కలిసి సంబురాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా గజ్వేల్ ప్రజ్ఞాపూర్ మున్సిపల్ మాజీ చైర్మన్ భాస్కర్, మాజీ కౌన్సిలర్ సుభాష్ చంద్రబోస్, కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు మోహన్నగారి రాజు మాట్లాడుతూ రెండో విడత 1,50,000 రైతు రుణమాఫీ చేసిన సందర్భంగా గజ్వేల్ రైతు వేదిక వద్ద రైతులతో కలిసి కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సంబురాలు జరుపుకొన్నామన్నారు. రైతు పక్షపాతి సీఎం రేవంత్‌రెడ్డి చరిత్ర పుటల్లో నిలిచిపోతారని, ఎన్నికల హామీ రుణమాఫీ చేసిన ఘనత కాంగ్రెస్ పార్టీకే దక్కిందని గత ప్రభుత్వం మాటలకే పరిమితమైందని కాంగ్రెస్ పార్టీ చేతల ప్రభుత్వమని రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ విజయభేరి మోగిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు శ్రీనివాస్, రమేష్‌గౌడ్, సత్యనారాయణ, కొండల్‌రెడ్డి, రాజు, షరీఫ్, రాజాగౌడ్, జానీపాషా, గాడిపల్లి శ్రీనివాస్, మోహన్, శేఖర్, గాజుల శ్రీనివాస్, కన్నా యాదవ్, నక్క రేగొండ, సంగుపల్లి మల్లేశం, చంద్రం ,అరుణ్, గుండు లక్ష్మణ్, సత్యం, కృష్ణ, అశోక్ గౌడ్, కాంగ్రెస్ కార్యకర్తలు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

## బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలి





**మెదక్, జులై 30 (ప్రజా స్వరం) :**

బీసీ డిక్లరేషన్ అమలు చేయాలని బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు గడ్డం కాశీనాథ్ ఆధ్వర్యంలో మంగళవారం మెదక్ జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షుడు కాశీనాథ్ నాయకులతో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రవేశపెట్టిన హామీలను, కామారెడ్డి సభలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్ ను వెంటనే అమలు చేయాలని అన్నారు. హామీలు ఇచ్చి ఏ విధంగా అయితే బీసీల ఓట్లను దండుకునీ ఏ విధంగా అధికారంలోకి వచ్చారు అదేవిధంగా బీసీలకు ఇచ్చిన హామీలను అమలు పరచాలన్నారు. బీసీలకు రిజర్వేషన్ల పెంపు, రాష్ట్ర ప్రభుత్వ బడ్జెట్లో నిధుల కేటాయింపులో బీసీలకు తీవ్ర అన్యాయం చేశారన్నారు. ఇప్పటికైనా బీసీలకు ఇచ్చిన హామీలను నెరవేర్చకుంటే పెద్ద ఎత్తున ఆందోళన చేపడతామన్నారు. బీఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేలను కాంగ్రెస్ పార్టీలో చేర్చుకోవడంలో ఉన్న శ్రద్ధ హామీలను అమలు చేయడంలో లేదన్నారు. హామీలను వెంటనే నెరవేర్చకపోతే ప్రజల ఆగ్రహానికి మీరు గురికాక తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు నాయని ప్రసాద్, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు సతీష్, ఓబీసీ మోర్చా జిల్లా కోశాధికారి శివ, నాయకులు సత్యనారాయణ, విట్టలేశ్, ప్రభాకర్, సంగీత పాల్గొన్నారు.



## ఏడిదుల ఎల్లమ్మకు మైనంపల్లి పూజలు

**రామాయంపేట, జులై 30 (ప్రజాసర్వం) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు పర్యటించారు. మండల కేంద్రంలోని ఏడీదుల ఎల్లమ్మ వద్ద బోనాల ఊరేగింపు, రైతు బజార్ వద్ద రేణుక ఎల్లమ్మ దేవాలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఆషాడమాసం సందర్భంగా గ్రామదేవతలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. రాష్ట్ర ప్రజలంతా సుభిక్షంగా ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని అమ్మవారిని కోరుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో టీపీసీసీ కార్యదర్శి చౌదరి సుప్రభాత్ రావు, టీపీసీసీ రాష్ట్ర అధికార ప్రతినిధి పల్లె రామచంద్రగౌడ్, విప్లవ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

## లైన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

**రామాయంపేట, జులై 30 (ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా రామాయంపేట మండల కేంద్రంలో మంగళవారం లయన్స్ క్లబ్ ఆఫ్ రామయంపేట, స్నేహబంధం ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. లయన్స్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ ఘట్టమనేని బాబురావు జన్మదినం సందర్భంగా ప్రభుత్వ ఆస్పత్రిలో రోగులకు అన్న ప్రసాద వితరణ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాగర్, కార్యదర్శి శ్రీనివాసరావు, దామోదర్, ఐరేని రవీందర్ గౌడ్ బాజా బాలరాజ్, శ్రీనివాస్, సతీష్ రావు పాల్గొన్నారు.



## మృతుడి కుటుంబాని ఎమ్మెల్సీ పరామర్శ

**రామయంపేట, జులై 30 (ప్రజా సర్వం) :**

టీఆర్ఎస్ నాయకుడు కూచన్‌పల్లి గ్రామ మాజీ ఉప సర్పంచ్ కూకుట్ల బయ్యన్న తల్లి మంగళవారం మృతిచెందింది. ఈ విషయం తెలుసుకున్న ఎమ్మెల్సీ శేరి సుభాష్‌రెడ్డి బయ్యన్నను పరామర్శించారు. ఆయనతో పాటు టీఆర్ఎస్ నాయకులు మల్లయ్య, కిషన్, నర్సారెడ్డి, బాలు, సంతోష్, రాములు తదితరులు ఉన్నారు.

## రామాయంపేటలో వనమహోత్సవం

**రామాయంపేట, జులై 30 (ప్రజా సర్వం) :**



మెదక్ జిల్లా రామాయంపేట మున్సిపాలిటీ పరిధిలో వనమహోత్సవం కార్యక్రమం మంగళవారం ఘనంగా నిర్వహించారు. 75వ వనమహోత్సవం సందర్భంగా స్థానిక మున్సిపల్ పాలకవర్గం సభ్యులు మొక్కలు నాటారు. వెంకటగిరి వెంచర్‌లో మున్సిపల్ స్థలంలో సుమారు 1000 మొక్కలను నాటి వనమహోత్సవం కార్యక్రమాన్ని మున్సిపల్ పాలకవర్గం సభ్యులు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాబోవు తరాలకు స్వచ్ఛమైన గాలి అందించాలంటే ప్రతి ఒక్కరు మొక్కలు నాటి చెట్లను సంరక్షించాలని పిలుపునిచ్చారు. మున్సిపాలిటీ పరిధిలో సుమారు 25వేల మొక్కలు నాటేందుకు ప్రణాళికలు రూపొందించామని, హోమ్ ప్లాంట్స్‌తో పాటు పలు ఖాళీ స్థలాలలో మొక్కలు నాటేందుకు చర్యలు చేపడుతున్నామని మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన వనమహోత్సవం కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని మొక్కలు నాటి చెట్లను సంరక్షించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, వైస్ చైర్మన్ పుట్టి విజయలక్ష్మి, పీఏసీఎస్ చైర్మన్ బాదే చంద్రం, మున్సిపల్ కమిషనర్ దేవేందర్, కౌన్సిలర్లు గజవాడ నాగరాజు, దేమే యాదగిరి, సుందర్ సింగ్, దేవుని రాజు, సరాఫ్ శ్యామ్ సుందర్, కోఆప్షన్ సభ్యులు ఎస్.కె హైమద్, ఐరేని పృథ్వీరాజ్ గౌడ్, మున్సిపల్ మేనేజర్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.





## ఘనంగా బోనాల ఉత్సవాలు

**మెదక్, జులై 30 (ప్రజా స్వరం) :** ఆషాఢ మాసం పురస్కరించుకుని మంగళవారం మెదక్ జిల్లా కేంద్రంలో అరె కటిక సంఘం ఆధ్వర్యంలో బోనాల ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉదయం మహిళలు అమ్మవారికి ఒడి బియ్యం సమర్పించి, ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సాయంత్రం పట్టణ పుర వీధుల గుండా బోనాల ఊరేగింపు వైభవంగా సాగింది. బోనాల ఊరేగింపు డప్పు చప్పుళ్లు, శివ సత్తుల నృత్యాలు, పోతరాజుల విన్యాసాలు మధ్య సాగాయి.

## జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే ధ్యేయం



**శేరిలింగంపల్లి, (ప్రజా స్వరం) :**

జర్నలిస్టుల సంక్షేమమే టీయూడబ్ల్యూజే ధ్యేయమని రాష్ట్ర అధ్యక్షుడు విరాహత్ అలీ అన్నారు. మంగళవారం మియాపూర్ హోటల్ అశోక గ్రాండ్‌లో నూతన రాష్ట్ర కమిటీకి ఆత్మీయ సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా టీయూడబ్ల్యూజే రాష్ట్ర కమిటీలో రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ జిల్లాల నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న నాయకులకు శేరిలింగంపల్లి యూనియన్ జర్నలిస్టులు సత్కరించారు. రాష్ట్ర అధ్యక్షుడిగా బాధ్యతలు చేపట్టిన విరాహత్ అలీని, కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డిని, కోశాధికారి వెంకట్‌రెడ్డిలను ఘనంగా సత్కరించారు. ఐజేయూ జాతీయ కౌన్సిల్ సభ్యులు ఎండీ సలీమ్ పాషా ఆధ్వర్యంలో జరిగిన ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ శేరిలింగంపల్లి శాఖ ఆధ్వర్యంలో ఆత్మీయ సమావేశం ఏర్పాటు చేయడం సంతోషంగా ఉందన్నారు. గడిచిన పదేళ్ల కాలంలో విలేకరుల సమస్యలు పరిష్కారానికి నోచుకోక అనేక ఇబ్బందుల పాలయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. దేశంలో జర్నలిస్టుల గొంతుకగా పోరాటం చేస్తున్న శ్రీనివాస్ రెడ్డికి ప్రస్తుత ప్రభుత్వం తెలంగాణ మీడియా అకాడమీ చైర్మన్ పదవిని అప్పగించడం ద్వారా జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి మార్గం సుగమం చేసిందన్నారు. ప్రస్తుత ప్రభుత్వం జర్నలిస్టుల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యతనిస్తూ త్వరలోనే హెల్త్ కార్డులను అందిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అర్హుడైన ప్రతి విలేఖరికి అక్రిడిటేషన్ అందాల్సిన అవసరం ఉందని, అయితే మార్కెట్లో విచ్చలవిడిగా ఎవరికి పడితేవారికి అక్రిడిటేషన్లు దొరకడం విచారకరమన్నారు. కార్యక్రమంలో శ్రీకాంత్‌రెడ్డి, శంకర్, బాలరాజు, రాజేష్, కిషన్, సత్యనారాయణ, శ్రీనివాస్‌రావు, నాగవేందర్‌రెడ్డి, శ్రీనివాసులుగౌడ్, సత్యనారాయణ, విజయ్‌కుమార్, తిరుపతిరెడ్డి, మాధవ రెడ్డి, ప్రణయ్ ముదిరాజ్, అశోక్ యాదవ్, వరుణ్, లక్ష్మణ్‌గౌడ్, వెంకటేష్‌గౌడ్, శ్రీనివాస్, నరేష్, ప్రవీణ్, గోవర్ధన్‌రెడ్డి, నాగేష్, శంకర్, యాసిన్, రమేష్ పాల్గొన్నారు.





## 13 నెలలుగా జీతాల్లేవ్

**మెదక్, జులై 30 (ప్రజా స్వరం) :**

పశు వైద్య సంచార వాహనాలు (1962) గల కాంట్రాక్టర్ సిబ్బందికి గత 13 నెలలుగా నిధులు లేక జీతాలు రావట్లేదనీ పశు వైద్య సంచార సిబ్బంది ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ప్రతీ నియోజకవర్గంకి ఒక సంచార పశు అంబులెన్సులు ఉన్నాయి. అందులో కాంట్రాక్టర్ వెటర్నరీ డాక్టర్ ప్యారావేట్ డ్రైవర్ అటెండర్ విధులు నిర్వహిస్తున్నారు. 13 నెలలుగా నిధులు లేక జీతాలు రాకపోవడంతో దుర్భర పరిస్థితిలు అనుభవస్తున్నమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే స్పందించి ఆదుకోవాలని సిబ్బంది వేడుకున్నారు.

## రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు



**రామాయంపేట, జూలై 30 (ప్రజా సర్వం) :**

మెదక్ జిల్లా రామాయంపేట పట్టణంలోని రైతు బజార్ ఏరియా వద్ద రేణుక ఎల్లమ్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ మెదక్ నియోజకవర్గ ఇన్‌చార్జి కంఠారెడ్డి తిరుపతిరెడ్డి ముఖ్యతిథిగా హాజరై ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధికి రూ.25వేలు విరాళం అందజేశారు. కార్యక్రమంలో రామాయంపేట మున్సిపల్ చైర్మన్ పల్లె జితేందర్ గౌడ్, పట్టణ అధ్యక్షుడు నాగరాజు, పీఏసీఎస్ చైర్మన్‌లు చంద్రం, కొండల్‌రెడ్డి, కౌన్సిలర్ యాదగిరి, కో ఆప్షన్ సభ్యుడు హైమద్, బాలుగౌడ్, మహంకాళి దేవస్థాన మాజీ డైరెక్టర్లు రాములు, సీనియర్ నాయకుడు కృష్ణగౌడ్, ఎండీ సల్మాన్ పాల్గొన్నారు.

## కల్యాణలక్ష్మి పథకం ఆడబిడ్డలకు వరం

### ఎమ్మెల్యే మైనంపల్లి రోహిత్



**మెదక్, జులై 30 (ప్రజా స్వరం) :**

కల్యాణలక్ష్మి పథకం పేదింటి ఆడబిడ్డలకు వరమని మెదక్ ఎమ్మెల్యే డా. మైనంపల్లి రోహిత్ అన్నారు. మంగళవారం స్థానిక ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో హావేళిఘణాపురం మండలానికి సంబంధించి 53 మంది లబ్ధిదారులకు కల్యాణలక్ష్మి



చెక్కులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అందించే పథకాలు ప్రతి ఒక్కరికి అందేలా చర్యలు తీసుకుంటాని హామీనిచ్చారు. కార్యక్రమంలో హావేళిఘణపురం మండల కాంగ్రెస్ పార్టీ నాయకులు లక్కరు శ్రీనివాస్, పట్టణ కాంగ్రెస్ పార్టీ నాయకులు గూడూరి ఆంజనేయులు, హఫీజ్ మోల్సాబ్, చైర్మన్ చంద్రపాల్, తదితరులు పాల్గొన్నారు.



# చదువుతోనే సమాజంలో గుర్తింపు

## వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్

**వికారాబాద్, జూలై 30(ప్రజా స్వరం) :**

చదువుతోనే సమాజంలో గుర్తింపు వస్తుందని వికారాబాద్ జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ అన్నారు. మంగళవారం నవాబ్‌పేట్ మండల కేంద్రంలోని ఒక ఫంక్షన్ హాల్‌లో అక్షర చేయుత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో 202324 విద్యా సంవత్సరంలో 10 వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను సత్కరించేందుకు ప్రతిభ పురస్కార్ మహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కలెక్టర్ ప్రతీక్ జైన్ ముఖ్యతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులు చదువు పట్ల శ్రద్ధను పెంచుకొని ఉన్నతమైన స్థానానికి ఎదగాలన్నారు. తుపాకీ గుండు కంటే చదువు మించింది లేదన్నారు. సమాజంలో మార్పు రావాలంటే చదువు ద్వారానే సాధ్యమవుతుందన్న మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం మాటను కలెక్టర్ గుర్తుచేశారు. చదువు లేకపోవడం వల్ల సమాజంలో కొందరు తప్పు దారిలో వెళ్తారన్నారు. ప్రపంచంలోని మంచి చెడులను తెలుసుకొని సన్మార్గంలో నడవడానికి చదువు ఎంతో దోహదపడుతుందని కలెక్టర్ అన్నారు. ఆడపిల్లలు ఉన్నత విద్యను అభ్యసించి ఉత్తమ శిఖరాలను అధిరోహించాలని కలెక్టర్ పేర్కొన్నారు. చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య మాట్లాడుతూ విద్యా వ్యవస్థను మెరుగుపరిచేందుకు ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందన్నారు. విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించే దిశగా గ్రామస్థాయి నుండి విద్యా వ్యవస్థను బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానన్నారు. అక్షర చేయూత స్వచ్ఛంద సేవా సంస్థ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ యాదవరెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులను ప్రోత్సహించినట్లయితే ఎన్నో విజయాలు సాధిస్తారన్నారు. గ్రామీణ విద్యార్థులను విద్యా వ్యవస్థను బలోపేతం చేసే దిశగా వీలుగా బడ్జెట్‌లో ప్రభుత్వం అధిక నిధులు కేటాయించిందన్నారు. విద్య, వైద్యం సౌకర్యాల నిమిత్తంతో పాటు ఉద్యోగాల కల్పన లక్ష్యంపై ప్రభుత్వం పని చేస్తుందన్నారు. కార్యక్రమంలో భాగంగా 18 మంది బాల, బాలికలకు ప్రతిభా పురస్కారాలతో పాటు నగదు బహుమతిని కలెక్టర్ అందజేశారు.

# 26,438 కుటుంబాలకు రూ.262.64 కోట్లు

## వికారాబాద్ జిల్లాలో రెండో విడత రుణమాఫీ

**వికారాబాద్, జూలై 30(ప్రజా స్వరం) :**

పంట రుణమాఫీపై రైతులు ఎలాంటి అపోహలకు తావు ఇవ్వొద్దని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. మంగళవారం రైతు నేస్తం పథకం ద్వారా రెండవ విడత రుణమాఫీ నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్‌లో రాజేంద్రనగర్ వ్యవసాయ యూనివర్సిటీలో రాష్ట్ర ప్రభుత్వం నిర్వహించిన కార్యక్రమాన్ని రైతులు, పీఏసీఎస్ చైర్మన్లు, వ్యవసాయ అధికారులతో కలిసి జిల్లా కలెక్టర్ ఆన్‌లైన్ ద్వారా వీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం చిత్తశుద్ధితో ఉందని, రైతులకు ఎలాంటి సందేహం ఉండకూడదన్నారు. ప్రభుత్వం నిర్ణయం మేరకు అర్హులైన లబ్ధిదారులకు రుణమాఫీ జరుగుతుందన్నారు. ప్రతిరైతు కుటుంబానికి 2 లక్షల రుణమాఫీ చేయడంలో భాగంగా మొదటి విడతలో వికారాబాద్ జిల్లాలో 46633 మంది లబ్ధిదారులకు 256.26 కోట్ల రూపాయల రుణమాఫీ చేశామన్నారు. రెండో విడత రుణ మాఫీలో భాగంగా జిల్లాలో 26438 మంది లబ్ధిదారులకు 262.64 కోట్ల రూపాయల నిధులు విడుదల చేయడం జరిగిందని ఆయన తెలిపారు. రుణమాఫీ అయిన రైతులు కొత్తగా రుణాలు పొందే అవకాశం ఉందని, ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని మంచి పంటలు పండించుకుంటూ వృద్ధిలోకి రావాలని కలెక్టర్ ఆకాంక్షించారు. రైతుల దయవల్లే ప్రజలకు ఎన్నో అవసరాలు తీరుతున్నాయని కలెక్టర్ తెలిపారు. రుణమాఫీ విషయంలో ఏవైనా సందేహాలు ఉంటే వ్యవసాయ అధికారులు, బ్యాంకర్లు రైతుల సమస్యలను తెలుసుకొని నివృత్తి చేసేందుకు తోడ్పడాలని కలెక్టర్ సూచించారు. ఈ సందర్భంగా కలెక్టర్ రైతులకు రుణమాఫీ చెక్కులను అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. రెండో విడతలో జిల్లా వ్యాప్తంగా 26438 రైతు కుటుంబాలు లబ్ధి పొందాయి. జిల్లాలోని వికారాబాద్ నియోజక వర్గంలో 7442 మంది లబ్ధిదారులకు 74.95 కోట్లు మాఫీ చేశారు. తాండూరు నియోజకవర్గంలో 5376 మంది రైతులకు 52.93 కోట్లు మాఫీ జరిగింది. పరిగి నియోజకవర్గంలో 6166 మంది రైతులకు 62.06 కోట్లు మాఫీ అయ్యాయి. కొడంగల్ నియోజక వర్గంలోని కొడంగల్, బొమ్మరాస్‌పేట్, దౌల్తాబాద్ మండలాలకు సంబంధించి 6057 మంది రైతులకు 61 కోట్ల రుణ మాఫీతో పాటు చేవెళ్ల నియోజకవర్గంలోని నవాబ్‌పేట మండలంలోని 1397 మంది లబ్ధిదారులకు 11.7 కోట్ల రుణ మాఫీ చేయడం జరిగింది. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ లింగ్యా నాయక్, జిల్లా వ్యవసాయ అధికారి గోపాల్, లీడ్ బ్యాంక్ మేనేజర్ యాదగిరి, జిల్లా సహకార అధికారి ఈశ్వరయ్య, మున్సిపల్ చైర్ పర్సన్ మంజుల రమేష్, పిఎసిఎస్ చైర్మెన్ లు సత్యనారాయణ, లక్ష్మారెడ్డి, మొగులయ్య, సంతోష్ రెడ్డి, జయకృష్ణ తదితరులు పాల్గొన్నారు.











మేడ్చల్ జిల్లా అదనపు కలెక్టర్‌గా నూతనంగా బాధ్యత చేపట్టిన రాధిక గుప్తాను మంగళవారం తూంకుంట మున్సిపల్ కమిషనర్ వెంకట్‌గోపాల్ మర్యాదపూర్వకంగా కలిశారు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో రాధికా గుప్తాకు పుష్ప గుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ అభివృద్ధిపై చర్చించారు.

- మేడ్చల్ , జులై 30 (ప్రజా స్వరం)

# మహిళల ఆర్థికాభివృద్ధికి చేయూత

## అదనపు కలెక్టర్ రాధిక గుప్తా

**మేడ్చల్, జులై 30 (ప్రజా స్వరం) :**

మహిళ శక్తి పథకం ద్వారా మహిళల ఆర్థికాభివృద్ధి చేయూత అందిస్తామని మేడ్చల్ జిల్లా స్థానిక సంస్థల ఆదనపు కలెక్టర్ రాధిక గుప్తా అన్నారు. జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టరేట్‌లో పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా ఇందిరా మహిళా శక్తి పథకంపై స్వయం సహాయక సంఘ సభ్యులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆదనపు కలెక్టర్ రాధిక గుప్తా మాట్లాడుతూ స్వయం సహాయక సంఘాల్లోని మహిళలకు ఆర్థిక చేయూత అందించేందుకు ప్రభుత్వం 'మహిళ శక్తి' కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు తెలిపారు. మహిళా క్యాంటీన్‌లతో పాటు స్త్రీనిధి లింకేజ్, బ్యాంకు లింకేజ్, సీబీవోల ద్వారా నిధులు సమకూర్చి మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు రుణ సదుపాయం కల్పిస్తామన్నారు. 13 రకాల యూనిట్లు నెలకొల్పడం ద్వారా ఆర్థికంగా మరింత బలోపేతం చేయాలని ప్రభుత్వం సంకల్పించిందని రాధికా గుప్తా తెలిపారు. కార్యక్రమంలో జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి సాంబశివరావు, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ అనీల్ కుమార్, లీడ్ బ్యాంక్ మేనేజర్ శివప్రసాద్, సంక్షేమ శాఖ అధికారి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



# పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

## మున్సిపల్ చైర్ పర్సన్ మంజులరమేష్

**వికారాబాద్, జూలై 30(ప్రజాస్వరం):**

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని వికారాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్ చిగుళ్లపల్లి మంజుల రమేష్ అన్నారు. మంగళవారం అసెంబ్లీ స్పీకర్, వికారాబాద్ ఎమ్మెల్యే గడ్డం ప్రసాద్ కుమార్ ఆదేశాల మేరకు వికారాబాద్ మున్సిపల్ పరిధిలోని 6వ వార్డు ఏసీఆర్ కాలనీలో మంగళవారం వన మహోత్సవం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మున్సిపల్ పార్కులో చైర్‌పర్సన్ మొక్కను నాటి వన మహోత్సవం కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో కమిషనర్ జాకీర్ అహ్మద్, మాజీ వైస్ చైర్మన్ రమేష్‌కుమార్, కౌన్సిలర్ చందర్ నాయక్, కౌన్సిలర్లు గాయత్రిలక్ష్మణ్, స్వాతిరాజ్‌కుమార్, శ్రీదేవి సదానంద్‌రెడ్డి, నాయకులు రాజ్‌కుమార్, పరశురాం నాయక్ తదితరులు పాల్గొన్నారు.





# తప్పిన ప్రమాదం

**వికారాబాద్, జూలై 30 (ప్రజాస్వరం) :**

వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం నీలపల్లి మార్గంలో ప్రయాణించిన స్కూల్ బస్సుకు త్రుటిలో ప్రమాదం తప్పింది. తాండూర్ పట్టణ శివారులోని గౌతమి స్కూల్ నుంచి మంగళవారం మధ్యాహ్నం విద్యార్థులతో బయలుదేరిన స్కూల్ బస్సు నీళ్లపల్లి గ్రామానికి వెళ్తున్నక్రమంలో మూలమలుపు వద్ద ఒక్కసారిగా జారి రోడ్డు దిగింది. వర్షం కురిసి రోడ్డు బుడగమయంగా ఉండడంతో ఈ ప్రమాదం జరిగినట్లు తెలుస్తోంది. బస్సు ప్రమాదానికి గురైన సమయంలో ఆరుగురు విద్యార్థులు ఉండగా వారంతా క్షేమంగా బయటపడ్డారు. బస్సు డ్రైవర్, కండక్టర్లకు మాత్రం స్వల్ప గాయాలయ్యాయి.

# చోరీ కేసును ఛేదించిన పోలీసులు

**మేడ్చల్, జులై 30 (ప్రజా స్వరం) :**

శామీర్‌పేట పోలీస్ స్టేషన్ పరిధిలోని రత్నాలయం దేవాలయంలో జరిగిన చోరీ కేసును వారం రోజుల్లో పోలీసులు ఛేదించారు. మంగళవారం శామీర్‌పేట పోలీస్ స్టేషన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మేడ్చల్ డీసీపీ కోటిరెడ్డి కేసు వివరాలను వెల్లడించారు. శామీర్‌పేట్ మండలం అలియాబాద్ చౌరస్తాలోని రత్నాలయం దేవాలయంలో ఈ నెల 24న ఇద్దరు గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనానికి పాల్పడ్డారని దేవాలయ చైర్మన్ వెంకటేష్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు సీసీ కెమెరాలు, సాంకేతిక పరిజ్ఞానంతో మేడ్చల్ మండలం, గుండ్ల పోచంపల్లి ప్రాంతానికి చెందిన నీలపు నీలయ్య(24), చింతాడ శీను(22) లతోపాటు ముషీరాబాద్‌కు చెందిన మహమ్మద్ అస్లాం అలీ(30) ముగ్గురు నిందితులను ఆదుపలోకి తీసుకున్నారు. మరొకరు పరారీలో ఉన్నారని తెలిపారు. సోమవారం నాలుగున్నర గంటలకు నిందితులు మేడ్చల్ మండలం మునీరాబాద్ గ్రామ సమీపంలోని ఓ ఆర్ ఆర్ సర్వీస్ రోడ్ అండర్ పాస్ వద్ద నిందితులు నీలపు నీలయ్య ,చింతాడ శీను రత్నాలయం దేవాలయంలోని దొంగలించబడిన సొత్తును మహమ్మద్ అస్లం అలీ కి విక్రయిస్తుండగా సమాచారం అందుకున్న పోలీసులు నిందితులను పట్టుకున్నారు. వీరి నుండి రూ.80 లక్షల విలువైన సొత్తును స్వాధీనం చేసుకున్నారు. గోల్డెన్ లాకెట్(01), సిల్వర్ మంగళసూత్రం(02) సిల్వర్ ఖడ్గం(01 ), వెండి దండకం(01), వెండి శఠ గోపం(02) వెండి కిరీటాలు(05), వెండి వడ్డాలం(01), వెండి నాగ పడిగే(02) మరియు శ్రీదేవి భూదేవి శ్రీనివాస ఉత్సవ మూర్తి పంచలోహాలు(04), సుదర్శన చక్రం(01), 80 వేల నగదు, నాలుగు స్మార్ట్ ఫోన్లు, రెండు హోండా యాక్టివా స్కూటీలు స్వాధీనం చేసుకున్నారు. నాల్గవ నింధితుడు షరీఫ్ పరారీలో ఉన్నట్లు డీసీసీ వెల్లడించారు.



# జిల్లాలో రుణమాఫీ సంబురాలు

**వికారాబాద్, జూలై 30 (ప్రజాస్వరం) :**

వికారాబాద్ జిల్లాలో రైతు నేస్తంలో భాగంగా రూ.లక్షన్నర లోపు పంట రుణాలను మంగళవారం ప్రభుత్వం మాఫీ చేయడంతో జిల్లాలోని రైతులు సంబురాలు జరుపుకొన్నారు. జిల్లాలోని వికారాబాద్, పరిగి, కొడంగల్, తాండూరు నియోజకవర్గాల పరిధిలోని రైతులు ఆయా ప్రాంతాల్లోని రైతు వేదికల వద్ద కాంగ్రెస్ నాయకులతో కలిసి రైతులు సంబురాలు జరుపుకున్నారు. టపాసులు కాల్చి ప్రభుత్వంపై తమ అభిమానాన్ని చాటుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పంట రుణాలు మాఫీ చేయడంతో కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన మాట నిలబెట్టుకుందన్నారు. రైతుల కలలు నెరవేర్చేందుకు సీఎం రేవంత్ రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. వికారాబాద్ జిల్లాలో మొదటి, రెండు విడతల్లో మొదటి విడతలో వికారాబాద్ జిల్లాలో 46633 మంది లబ్ధిదారులకు రూ. 256.26 కోట్ల రుణమాఫీ అయ్యాయి. అలాగే రెండో విడత పంట రుణమాఫీ కింద లక్షా 50 వేలలోపు ఉన్న రుణాలకు గాను రూ.262.64 కోట్ల నిధులు మంజూరు చేశారు. రెండవ విడతలో జిల్లా వ్యాప్తంగా 26438 రైతు కుటుంబాలు లబ్ధి పొందాయి.

# సాగునీటి ప్రాజెక్టులకు నిధులు కేటాయించాలి

## తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి

**వికారాబాద్, జూలై 30 (ప్రజాస్వరం) :**

వికారాబాద్ జిల్లా తాండూర్ ప్రాజెక్టులపై మరోసారి పట్టువదలని విక్రమార్కుడిలా మంగళవారం జరిగిన అసెంబ్లీలో పలు అంశాలను తాండూరు ఎమ్మెల్యే బుయ్యని మనోహర్‌రెడ్డి ప్రస్తావించారు. నియోజకవర్గంలో ప్రధాన సాగు నీటిపారుదల ప్రాజెక్టులు అయిన కోట్‌పల్లి, జుంటుపల్లి, శివసాగర్‌తో పాటు బషీరాబాద్ మండలంలోని ఎత్తిపోతల పథకాల గూర్చి ప్రస్తావిస్తూ వీటి ఆధునికరణ అభివృద్ధికి రాష్ట్ర ప్రభుత్వం సరైన విధంగా నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రజా ప్రభుత్వం ఏర్పాటు అయిన తర్వాత వెంబడే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వికారాబాద్ జిల్లాపై ప్రత్యేక దృష్టి సారించడం వల్ల వికారాబాద్ జిల్లాకు చెందిన స్పీకర్ చొరవతో రాష్ట్ర అధికారులే స్వయంగా ప్రాజెక్టుల బాట పట్టి పూర్తి సమగ్ర సమాచారంతో నివేదిక తయారు చేసి ప్రభుత్వానికి నివేదికలు సమర్పించామన్నారు. త్వరలో నిధులు మంజూరు చేసి ప్రాజెక్టులు పూర్తి చేసి రైతులకు నీరందించాల్సిందిగా ఎమ్మెల్యే కోరారు. అలాగే బషీరాబాద్ మండలంలో కాగ్నా నదిపై నిర్మించిన ఇందర్‌చెడ్, జీవంగ్గీ, నవాంగ్గీ ఆయకట్టు ఎత్తిపోతల పథకం ద్వారా బషీరాబాద్ మండలంలో 6 వేల ఎకరాల వరకు సాగునీరు అందించే అవకాశం ఉన్నా గత ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యం చేయడం వల్ల కర్ణాటక రాష్ట్రానికి నీరు వృథాగా పోతుందన్నారు. ఈ చిన్నతరహా ప్రాజెక్టులకు అవసరమైన మరమత్తులకై నిధులు మంజూరు చేయాలని సభద్వారా ముఖ్యమంత్రి దృష్టికి సంబంధిత మంత్రి దృష్టికి తీసుకువెళ్లారు.



Edited, Printed, Published and Owned by Puram Maheshwar, Printed at Hari Hara Art Printers, H.No.6-1,85, Toopran, Medak (Dist) Telanagana 502336. Published at H.No. 4-50/18, Kallakal (Vill), Kallakal (Po), Manoharabad (M), Medak (Dist), Telangana 502336. Editor Puram Maheshwar. RNI No. TELTEL/2006/17154

# ప్రజాస్వరం
PRAJASWARAM
తెలుగు దినపత్రిక

**Bullet Edition**

మంగళవారం, 30 జూలై 2024 www.prajaaswaramdaily.com 2PM


# ఒలింపిక్స్‌లో భారత్‌కు రెండో పతకం

## కాంస్య పతకాన్ని సాధించిన మను బాకర్, సరబ్‌జోత్ జోతి

న్యూఢిల్లీ, జూలై 30 (ప్రజాస్వరం): ఒలింపిక్స్ లో భారత్ రెండో పతకం గెలుచుకుని సత్తా చాటింది. 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ మిక్స్ డ్ టీమ్ ఈవెంట్లో కాంస్యం గెలుచుకుంది. మను బాకర్, సరబ్ జోత్ జోతి కాంస్య పతకాన్ని సాధించి భారత్ కు రెండో పతకాన్ని అందించారు. కొరియా జంటపై 16–10 తేడాతో భారత జోడీ గెలుపొందింది. ఒకే ఒలింపిక్స్ లో 2 పతకాలు సాధించి మను బాకర్ రికార్డు సొంతం చేసుకున్నారు. అయితే భారత్ కు వ్యక్తిగత విభాగం 10 మీటర్ల ఎయిర్ పిస్టల్ లో కాంస్య పతకాన్ని మను బాకర్ సాధించారు. ఇండియా బ్రిటిష్ పాలనలో ఉన్నప్పుడు 1900లో ఒలింపిక్స్ అథ్లెటిక్స్ లో నార్మన్ ప్రిచర్డ్ ఒకేసారి రెండు పతకాలు సాధించాడు. ఇండియా తరపున ప్రిచర్డ్ ప్రాతినిధ్యం



వహించాడు. ప్రిచర్డ్ తర్వాత ఒకే ఒలింపిక్స్ లో ఇప్పటి వరకు రెండు పతకాలను ఏ భారత అథ్లెట్ ఈ ఫీట్ సాధించలేదు. కాగా, తాజా ఒలింపిక్స్ లో రెండు పతకాలు సాధించి మన బాకర్ సరికొత్త చరిత్ర లిఖించారు.

# సొంతగూటికి 'బండ్ల'

## బీఆర్ఎస్ లోనే కొనసాగాలని గద్వాల్ ఎమ్మెల్యే ఘర్‌వాపసీ

హైదరాబాద్, జూలై 30 (ప్రజాస్వరం) : గద్వాల్ ఎమ్మెల్యే ఘర్ వాపసీకి రెడీ అయ్యారు. అసెంబ్లీ లాబీల్లోని ఎల్‌వోపీ చాంబర్ లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ను కలిసి తాను పార్టీలోనే కొనసాగుతానని గద్వాల్ ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్ రెడ్డి తెలిపారు. తనను నమ్మించి కాంగ్రెస్ పార్టీలో చేర్చుకొని అవమానించారని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. తనను తిరిగి పార్టీలోకి తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కృష్ణమోహన్ రెడ్డి నిర్ణయాన్ని స్వాగతించిన కేటీఆర్ పార్టీ చీఫ్ కేసీఆర్ కలవాలని సూచించారు. అసెంబ్లీ నుంచి కృష్ణమోహన్ రెడ్డి బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ను కలిసేందుకు బయల్దేరారు. బీఆర్ఎస్ బీఫాంపై గెలిచిన పది మంది ఎమ్మెల్యేలు సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ లో చేరారు. పార్టీలో చేరే వరకు ఇచ్చిన గౌరవం, కండువా కప్పుకున్న తర్వాత వారికి దక్కడం లేదు. బడ్జెట్ సమావేశాల్లోపే బీఆర్ఎస్ ఎల్పీ సీఎల్పీలో విలీనమవుతుందని నమ్మబలికితేనే పది ఎమ్మెల్యేలు బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్ లో చేరారు. బీఆర్ఎస్ నుంచి ఎమ్మెల్యేలు వీడకపోవడం, అసెంబ్లీలో ఏదో ఒక మూలన కూర్చోవాలని సీఎం చెప్పడంతో దానిని పార్టీ మారిన ఎమ్మెల్యేలు అవమానంగా ఫీలవుతున్నారు. దీంతో, పలువురు తిరిగి బీఆర్ఎస్ గూటికి చేరుకునేందుకు ప్రయత్నిస్తున్నారు. కొన్ని రోజుల క్రితం ప్రజాభవన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ బీఫాంపై గెలిచిన ఎమ్మెల్యేలను కూర్చోబెట్టి బండ్ల కృష్ణమోహన్ రెడ్డిని నిల్చోబెట్టారు. ఈ ఘటనతో ఆయన నొచ్చుకున్నారు. ఈ నేపథ్యంలో కాంగ్రెస్‌ను వీడి తిరిగి బీఆర్ఎస్‌లోనే కొనసాగాలని నిర్ణయించుకున్నారు.



# కొనసాగుతున్న అసెంబ్లీ సమావేశాలు

హైదరాబాద్, జూలై 30 (ప్రజాస్వరం) : అసెంబ్లీ సమావేశాలు కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు స్కిల్స్ యూనివర్సిటీ బిల్లును అసెంబ్లీలో ప్రవేశపెట్టారు. మరో 19 పద్దులపై శాసనసభలో చర్చ కొనసాగుతోంది. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ కీలక రిక్వెస్ట్ చేశారు. నిన్నటిలా సుదీర్ఘ ప్రసంగాలు చేయవద్దని సభ్యులను కోరారు. సబ్జెక్ట్‌పైనే మాట్లాడాలని సభ్యులందరికీ విజ్ఞప్తి చేశారు. వ్యవసాయం, సహకార, నీటిపారుదల, ఆర్అండ్‌బీ, పంచాయతీ రాజ్, రెవెన్యూ, రిజిస్ట్రేషన్లు, గృహనిర్మాణం, పౌరసరఫరాలు, పశుసంవర్ధక, పర్యాటక, క్రీడాశాఖలు, అటవీ, దేవదాయ, మైనార్టీ, చేనేత, స్త్రీ శిశు సంక్షేమ శాఖ పద్దుల చర్చ జరుగుతున్నది.



# నేడు పండుగ రోజు

## సోనియా, రాహుల్ ఇచ్చిన హామీ మేరకు రుణమాఫీ

## మా జన్మ ధన్యమైంది : సీఎం రేవంత్ రెడ్డి

## రైతుల ఖాతాల్లో రెండో విడత రుణమాఫీ డబ్బులు

## 6.4 లక్షల మందికి రూ.6,190 కోట్లు జమ

హైదరాబాద్, జూలై 30 (ప్రజాస్వరం) : తెలంగాణ రైతాంగానికి కాంగ్రెస్ సర్కారు రెండో విడత రుణమాఫీ పథకాన్ని ప్రారంభించింది. అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి రుణమాఫీ నిధులను విడుదల చేశారు. రెండో విడతలో 6.4 లక్షల మంది రైతులకు రూ.6,190 వేల కోట్లు జమ కానున్నాయి. మొదటి, రెండో విడత రుణమాఫీ నిధులు మొత్తం రూ.12,289 కోట్లను ఈ స్కీంకు ఇప్పటి వరకు కాంగ్రెస్ సర్కారు వెచ్చించినట్లయింది. కాగా, ఈనెల 19న తొలి విడతలో రేవంత్ సర్కారు సుమారు 10.83లక్షల కుటుంబాలకు చెందిన 11.34లక్షల అకౌంట్‌లలో రూ.6,035 కోట్లు జమ చేసినట్లు ప్రభుత్వం తెలిపింది. ఇన్ కమ్ ట్యాక్స్ చెల్లించే వారు, గవర్నమెంట్ ఎంప్లాయిస్, పింఛన్ దారును అర్హుల జాబితా నుంచి ప్రభుత్వం ఇప్పటికే తొలిగించింది.

### విపత్కర పరిస్థితులు ఎదురైనా..

రైతు రుణమాఫీ ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనమని సీఎం రేవంత్ రెడ్డి అన్నారు. ఇవాళ అసెంబ్లీ ప్రాంగణంలో రెండో విడత రైతు రుణమాఫీ కార్యక్రమంలో మాట్లాడుతూ.. రైతు రుణమాఫీతో తమ జన్మ ధన్యమైందని పేర్కొన్నారు. సోనియా, రాహుల్ గాంధీ ఇచ్చిన హామీ మేరకు రైతుల రుణమాఫీ చేశామని తెలిపారు. రూ.లక్షన్నర వరకు ఉన్న రుణాలన్నింటిని మాఫీ అయ్యాయని పేర్కొన్నారు. నేడు రాష్ట్రంలో రైతులందరి ఇళ్లలో పండుగ రోజు అని అన్నారు. రైతు ప్రయోజనాలే తమ విధానమని స్పష్టం చేశారు.

### మాట నిలబెట్టుకున్నాం : తుమ్మల

రైతులకు ఇచ్చిన హామీని నిలబెట్టుకున్నాయని వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర రావు అన్నారు. రెండో విడత రుణమాఫీలో రూ.1.5 లక్షల వరకు రుణం ఉన్న రైతులు 6.4 లక్షల మందికి రూ.6,190 కోట్లు జమ చేయనున్నట్లు పేర్కొన్నారు. తొలి విడతలో 11.34 లక్షల మంది రైతులకు రూ.6,035 కోట్లు విడుదల చేశామని తెలిపారు. రైతు రుణ మాఫీతో రాష్ట్ర వ్యప్తంగా ఇప్పటి వరకు 17.75 లక్షల మంది రైతులకు లబ్ధి చేకూరిందని అన్నారు. ఒకే పంట కాలంలో రూ.31 వేల కోట్లు రుణమాఫీ చేస్తున్నామని అన్నారు. అదేవిధంగా ఆగస్టులో రూ.2 లక్షల లోపు ఉన్న రుణాలను కూడా మాఫీ చేస్తామని అన్నారు.



# వయనాడ్‌లో విలయం..

**30కి పైగా మృతి.. పదుల సంఖ్యలో గల్లంతు**

న్యూఢిల్లీ, జూలై 30 (ప్రజాస్వరం): కేరళలోని వయనాడ్ జిల్లాలో మెప్పాడి సమీపంలోని వివిధ ప్రాంతాలలో మంగళవారం తెల్లవారుజామున భారీ కొండచరియలు విరిగిపడ్డాయి. ఇప్పటివరకు 30 మందికి పైగా చనిపోగా.. వందలాది మంది శిథిలాల కింద చిక్కుకున్నట్లు అనుమానిస్తున్నారు. కేరళ రాష్ట్ర విపత్తు నిర్వహణ దళం, అగ్నిమాపక బృందం, జాతీయ విపత్తు స్పందన దళాలు ఘటనా స్థలిలో సహాయకచర్యలు చేపడుతున్నాయి. 70 మందిని ప్రాణాలతో కాపాడారు. సహాయక చర్యల కోసం ఎయిర్‌ఫోర్స్‌కు చెందిన రెండు హెలికాప్టర్లు.. ఎంఐ–17, ఏఎల్‌హెచ్‌లను రంగంలోకి దించారు.రెస్క్యూ ఆపరేషన్ కోసం ఆర్మీ సైతం రంగంలోకి దిగింది. 225 మంది ఆర్మీ అధికారులు సహాయక చర్యల్లో పాల్గొంటున్నారు. భారీ వర్షాలు కురుస్తుండటంతో సహాయక చర్యలకు అంతరాయం కలుగుతోంది. ముండకైలో అర్ధరాత్రి 2 గంటలకు, ఆ తర్వాత తెల్లవారుజామున 4 గంటలకు రెండుసార్లు కొండచరియలు విరిగిపడ్డట్లు స్థానికులు వెల్లడించారు. 400కు పైగా కుటుంబాలు వరదలో చిక్కుకున్నట్లు తెలుస్తోంది. చాలా మంది ఆచూకీ తెలియరావడం లేదని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేశారు.

### ప్రధాని, రాష్ట్రపతి, రాహుల్ దిగ్భ్రాంతి

వయనాడ్ ప్రమాదంపై భారత ప్రధాని మోడీ, రాష్ట్రపతి ద్రౌపది ముర్ము దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. మృతుల కుటుంబాలకు ప్రభుత్వం అండగా ఉంటుందని.. గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని భగవంతున్ని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. అలాగే ఈ ఘటనపై సీఎం పినరయి విజయన్ తో ప్రధాని మోడీ ఫోన్ లో మాట్లాడారు. వెంటనే సహాయక చర్యలు చేపట్టాలని భారత ఆర్మీ సహాయం తీసుకోవాలని సూచించారు. వాయనాడ్ ఘటనపై విపక్ష నేత నేత రాహుల్ గాంధీ స్పందించారు. కొండ చరియలు విరిగి పడ్డాయనే వార్త విని తాను షాక్‌కు గురయ్యానని పేర్కొన్నారు. ఈ ఘటనలో ప్రాణాలో కోల్పోయిన కుటుంబాలకు ఆయన ప్రగాఢ సానుభూతిని వ్యక్తం చేశారు. మరిన్ని వివరాలను కేరళ సీఎం పినరయ్ విజయన్‌కు, జిల్లా కలెక్టర్‌కు ఫోన్ చేశానని పేర్కొన్నారు.





# జార్ఖండ్‌లో రైలు ప్రమాదం

రాంచి, జులై 30: జార్ఖండ్ లో సౌత్ ఈస్ట్ రైల్వే పరిధిలోని చక్రధర్ పూర్ డివిజన్‌లో బడాబాంబూ సమీపంలో మంగళవారం తెల్లవారుజామున ముంబయి - హౌరా ఎక్స్ ప్రెస్ రైలు పట్టాలు తప్పింది. మొత్తం 12 బోగీల్లో 10 పట్టాలు తప్పాయి. ఈ ప్రమాదంలో ఇద్దరు మరణించగా.. 20 మందికిపైగా గాయపడ్డారు. వైద్య చికిత్స కోసం వారిని బబాబాంబూ ఆసుపత్రికి తరలించారని రైల్వేశాఖ వెల్లడించింది. అయితే మెరుగైన వైద్య చికిత్స కోసం వారందరిని చక్రధరపూర్ కు పంపినట్లు తెలిపింది. సౌత్ ఈస్ట్ రైల్వే



డివిజన్ లోని ఉన్నతాధికారి మాట్లాడుతూ తెల్లవారుజామున 3.45 గంటలకు ముంబయి- హౌరా మెయిల్ తోపాటు సరుకు రవాణా రైలు కూడా ప్రమాదానికి గురైందని తెలిపారు. ప్రమాదం నేపథ్యంలో ఈ మార్గంలో నడిచే పలు రైళ్లను రద్దు చేశామని.. అలాగే మరికొన్ని రైళ్లను దారి మళ్లించామని తెలిపారు.

# హైదరాబాద్‌లో దారుణ ఘటనలు



### కదులుతున్న బస్సులో మహిళపై అత్యాచారం

హైదరాబాద్, జూలై 30 (ప్రజాస్వరం): హైదరాబాద్ నగరంలో దారుణ ఘటన జరిగింది. కదులుతున్న బస్సులో ప్రయాణికురాలిపై డ్రైవర్ అత్యాచారం చేశాడు. మహిళ డయల్ 100 నంబర్ కు కాల్ చేయడంతో విషయం వెలుగు చూసింది. ప్రాథమిక సమాచారం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. హరికృష్ణ ట్రావెల్స్ కు చెందిన ప్రైవేట్ బస్ లో ఓ మహిళ నిర్మల్ నుంచి ప్రకాశం జిల్లా పామూరు వెళ్తుంది. ఈ బస్ లో కృష్ణ, సిద్దయ్య ఇద్దరు డ్రైవర్లుగా ఉన్నారు. బస్సులో వేరే ప్రయాణికులు లేకపోవడంతో ఇదే అదునుగా భావించిన డ్రైవర్లు బస్సు అద్దాలను క్లోజ్ చేశారు. ఆ తర్వాత సిద్దయ్య బస్సు నడుపుతుండగా కృష్ణ మహిళ నోట్లో గుడ్డలు కుక్కి అత్యాచారం చేశాడు. బాధిత మహిళ వెంటనే డయల్ 100 నంబర్ కు కాల్ చేసి తనపై జరిగిన అఘాయిత్యంపై ఫిర్యాదు చేసింది. వెంటనే అప్రమత్తం అయిన పోలీసులు బస్ ఓయూ పోలీస్ స్టేషన్ పరిధిలోకి రాగానే పట్టుకున్నారు. ప్రస్తుతం పోలీసులు సిద్దయ్యను అదుపులోకి తీసుకొని విచారిస్తున్నట్లు సమచారం. మరో డ్రైవర్ కృష్ణ పరారీలో ఉన్నట్లు తెలుస్తోంది. పోలీసులు మరి కాసేపట్లో పూర్తి వివరాలు తెలియజేయనున్నారు.

### సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై గ్యాంగ్ రేప్

రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో సంచలన ఘటన చోటు చేసుకుంది. వనస్థలిపురంలో సాఫ్ట్‌వేర్ ఇంజినీర్‌పై గ్యాంగ్ రేప్ తీవ్ర కలకలం రేపింది. హోటల్‌లో తనపై అత్యాచారం చేశారని యువతి ఫిర్యాదు చేసింది. స్నేహితులతో కలిసి హోటల్‌కు యువతి వెళ్లింది. మద్యం మత్తులో యువతిపై అత్యాచారం చేసినట్లు ఆరోపించింది. స్నేహితుడితో పాటు మరొకరు అత్యాచారం చేసినట్లు తెలిపింది. యువతి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. ఈ ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.